క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెంలోని మండల పరిషత్ కార్యాలయంలో నేడు(మంగళవారం) సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహారావు తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశంలో ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

వలంటీర్లకు సత్కారం



వలంటీర్ శ్రీనివాసులును సత్కరిస్తున్న నాయకులు

వెంకటాచలం: మండలంలోని తిక్కవరప్పాడు గ్రామంలో సోమవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి శాలువలు కప్పి సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రోడ్డు, రవాణా కార్పొరేషన్ డైరెక్టర్ నలగర్ల భారతి, సర్పంచ్ చిరంజీవి, ఎంపీటీసీ సభ్యురాలు వెంకటరమణమ్మ, గ్రామ కార్యదర్శి ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నేతలు నరసింహారావు, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రై సైకిల్ వితరణ



ట్రైసైకిల్‌ను అందజేస్తున్న నేతలు

ఇందుకూరుపేట : మండలంలోని మైపాడు గ్రామానికి చెందిన వలంటీర్ మర్రి సుకన్యకు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్టు ద్వారా ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి బ్యాటరీతో నడిచే ట్రై సైకిల్‌ను అందించారు. మైపాడులో స్థానిక సర్పంచ్ సంగం వెంకయ్య, ఎంపీటీసీ సభ్యుడు రమణయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యుడు శ్రీహరికోట ప్రసాద్ ఈ సైకిల్‌ను సోమవారం సుకన్యకు అందజేశారు.

క్రికెట్ కిట్ అందజేత



మనుబోలు : మనుబోలు అంబేడ్కర్‌నగర్ యూత్‌కు బొమ్మిరెడ్డి పార్థేశ్వరరెడ్డి, చైతన్యరెడ్డి సోమవారం రెండు క్రికెట్ కిట్లను బహూకరించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

శేషజీవితం హాయిగా గడపాలి

నెల్లూరు(క్రైమ్): ఉద్యోగ విరమణ పొందిన సిబ్బంది శేషజీవితం హాయిగా గడపాలని ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి ఆకాంక్షించారు. ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డులు, మృతి చెందిన హోంగార్డుల కుటుంబ సభ్యులకు జిల్లా పోలీసు కార్యాలయంలో నగదు చెక్కులను సోమవారం ఎస్పీ అందజేశారు. ఉద్యోగ విరమణ పొందిన పీ రమణమ్మకు రూ.76,255, షేక్ మస్తాన్‌కు రూ.76,230, వీ చిట్టిబాబుకు రూ.77,700, సీహెచ్ మునికాంతమ్మకు రూ.77,775, డీ సత్యనారాయణకు రూ.79,170, ఎన్. వెంకటశేషయ్యకు రూ.19,850, టీ విజయలక్ష్మికి రూ.21,315, కే వెంకటేశ్వరరావుకు రూ.21,315 నగదు చెక్కులను అందజేశారు. మృతి చెందిన హోంగార్డులు శ్రీనివాసులు, ఎం వెంకయ్య, జీ వెంకటరమణ, షేక్ అమీర్‌బాషా, సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎస్ వాసుదేవరావు, ఆర్ శ్రీనివాసులు కుటుంబ సభ్యులకు నగదు చెక్కులు అందజేశారు. విధి నిర్వహణలో మృతి చెందిన హోంగార్డుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. ఏఎస్పీ డీ హిమవతి, హోంగార్డు డీఎస్పీ చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

నెల్లూరు(క్రైమ్): పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.వివరాలు..నవాబుపేటలోని చుండూరువారివీధిలో శ్రీరామమూర్తి(62) నివాసం ఉంటున్నారు. ఆయనకు భార్య, రమేష్, రాజేష్ కుమారులు ఉన్నారు. ఆయన నవాబుపేట సెంటర్‌లో కిళ్లీ షాపు నిర్వహిస్తున్నారు. ఆయన మూడేళ్లుగా గుండె, శ్వాసకోశ వ్యాధులతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నా ఆరోగ్యం మెరుగుపడలేదు. ఇటీవల వైద్యులు పనిచేయొద్దని సూచించారు. ఈ నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీరామమూర్తి ఈ నెల 22న సాయంత్రం ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆయన్ని కుటుంబ సభ్యులు తొలుత రామచంద్రారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అనంతరం అపోలో ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి పెద్దకుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు నవాబుపేట ఎస్సై కే తిరుపతయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముమ్మరంగా వరినాట్లు



పెదరాజుపాళెంలో రైతులు వేసుకున్న వరినాట్లు

- 3,500 ఎకరాల్లో నాట్లు పడే అవకాశం

పొదలకూరు : మండలంలోని పెన్నార్ డెల్టా, నాన్‌డెల్టా పల్లెల్లో రైతులు ఎడగారు వరినాట్లు వేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో నాట్లు ప్రారంభించగా మరికొన్ని గ్రామాల్లో నార్లు పోశారు. మండలంలో పంటల సాగు ప్రత్యేకంగా ఉంటుంది. మొత్తం 30 పంచాయతీలుండగా నీటి లభ్యత ఉన్న గ్రామాల్లోనే ఎడగారు పండిస్తారు. తాటిపర్తి, విరువూరు, సూరాయపాళెం, మహ్మదాపురం, నేదురుమల్లి, వెలికంటిపాళెం, డేగపూడి, పెదరాజుపాళెం, నావూరు తదితర గ్రామాల్లో కేఎన్‌ఎం1630 రకం వరిని ఎడగారులో సాగు చేస్తారు. అయితే ఈ ఎడగారులో సోమశిల ప్రాజెక్టు నుంచి నాన్‌డెల్టాకు సైతం కాలువల ద్వారా నీటిని విడుదల చేస్తుండడంతో అనుకున్న విస్తీర్ణం కంటే రైతులు అదనంగా సాగు చేస్తున్నారు. ఈ ఎడగారులో 3,500 ఎకరాల వరకు వరినాట్లు పడే అవకాశం ఉందని ఏఓ వాసు వెల్లడించారు. నీటి లభ్యతను బట్టి సాగు పెరిగే అవకాశం కూడా లేకపోలేదంటున్నారు. సోమశిల దక్షిణ కాలువకు నీటిని విడుదల చేయడంతో మండలంలో నాట్లు పెరుగుతాయని భావిస్తున్నారు.

రూ.25 వేలు పలుకుతున్న బీపీటీలు

రబీలో పండించిన బీపీటీ 5204(జిలకర మసూరా) రకం ప్రస్తుతం పుట్టి ఒక్కటింటికి రూ.25 వేలు ధర పలుకుతున్నాయి. వీటిని రైతులు ఆరబోసి నిల్వ చేయడంతో ధాన్యానికి ధర పెరిగినట్లు చెబుతున్నారు. తెలంగాణ మసూరు(షుగర్‌లెస్) ధాన్యం ప్రస్తుతం రూ.22 వేలు ధర పలుకుతున్నట్లు రైతులు తెలిపారు. ఈ రెండు రకాల ధాన్యాన్ని నిల్వ చేసుకున్న రైతులు అధిక ధరలకు అమ్ముకుంటున్నారు.

చాముండేశ్వరికి సింహ వాహనసేవ

ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నంలో ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం చాముండేశ్వరీదేవి అమ్మవారికి సోమవారం సింహవాహనసేవ వైభవంగా జరిగింది. ఈ నేపథ్యంలో అమ్మవారిని పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. సింహ వాహనంపై కొలువుదీర్చి గ్రామవీధుల్లో ఊరేగించారు. మేళతాళాల నడుమ ఊరేగుతున్న అమ్మవారికి భక్తులు కొబ్బరికాయ, కర్పూర హారతులు పట్టి స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు అనిల్‌స్వామి, రామకృష్ణస్వామి, కిశోర్ స్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఉభయదాతలుగా స్థానికులు కొండూరు సురారెడ్డి, పద్మావతి దంపతులు వ్యవహరించారు.



సింహ వాహనంపై ఊరేగుతున్న అమ్మవారు

జక్కా వెంకయ్యకు ఘన నివాళి



కోవూరు: జక్కా వెంకయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు



తోటపల్లిగూడూరు : మల్లికార్జునపురంలో..

బుచ్చిరెడ్డిపాళెం: కామ్రేడ్ జక్కా వెంకయ్య వర్ధంతిని బుచ్చిరెడ్డిపాళెంలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి సి.మల్లికార్జున మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం, అక్షరాస్యత, సారా వ్యతిరేక ఉద్యమాల్లో జక్కా వెంకయ్య పోరాటాలను ఎనలేనివన్నారు. అనంతరం వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పార్కు సెంటర్‌లో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మునీర్ అహ్మద్, ఖాదర్‌బాషా, మల్లయ్య, బాబు, సుబ్రహ్మణ్యం, సుబ్బారావు, శుభకుమార్, కృష్ణయ్య, జానీబాషా పాల్గొన్నారు.

పేదల కోసం పోరాడిన నేత

కొడవలూరు: పేదల కోసం అనేక పోరాటాలు చేసిన గొప్ప నాయకుడు జక్కా వెంకయ్య అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గోనె దయాకర్ అన్నారు. మండలంలోని నార్తురాజుపాళెంలో కామ్రేడ్ జక్కా వెంకయ్య వర్ధంతి సభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సమస్యల పరిష్కారానికి జక్కా వెంకయ్య అనేక ఉద్యమాలు చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు నరసింహం, దేవానంద్ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయులు.. జక్కా వెంకయ్య

తోటపల్లిగూడూరు : కామ్రేడ్ జక్కా వెంకయ్య ఆదర్శప్రాయులని సీపీఎం మండల కార్యదర్శి వేగూరు వెంకయ్య అన్నారు. మండలంలోని మల్లికార్జునపురం గ్రామంలో వామపక్ష పార్టీ నేతలు, కార్యకర్తల ఆధ్వర్యంలో సోమవారం వర్ధంతి కార్యక్రమం జరిగింది. స్థానికంగా ఉన్న సీపీఎం ఘాట్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేగూరు వెంకయ్య మాట్లాడుతూ మచ్చలేని రాజకీయ నేత జక్కా వెంకయ్య అని కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు మారుబోయిన రాజా, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు కాల్తిరెడ్డి రమణమ్మ, మధు పాల్గొన్నారు.

- కోవూరు: స్థానిక మైథిలి సెంటర్‌లో జక్కా వెంకయ్య వర్ధంతి కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి వామపక్ష నేతలు నివాళులర్పించారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకమరాజు మాట్లాడుతూ జక్కా వెంకయ్య పోరాటాలు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో భాగంగా మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కన్వీనర్ శేషయ్య, నేతలు శ్రీనివాసులు, బాబు, శ్రీనివాసులురెడ్డి, మల్లికార్జునరెడ్డి, పెద్దబ్బయ్య, రమేష్, సుబ్బారావు, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కొడవలూరు: నార్తురాజుపాళెంలో..



బుచ్చిరెడ్డిపాళెం: సీపీఎం కార్యాలయంలో..

31న బైక్ వేలం

పొదలకూరు : స్థానిక సెబ్ కార్యాలయంలో ఈనెల 31వ తేదీ బుధవారం ఉదయం 10.30 గంటలకు మోటార్‌బైక్ వేలం ఉంటుందని సెబ్ సీఐ వెంకట్రావ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హీరో హోండా బైక్ ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.4 వేలు అని, వేలంలో పాల్గొనేవారు రూ.10 శాతం అంటే రూ.400 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభం

పొదలకూరు : మండలంలోని మరుపూరులో కామాక్షి సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు సాయంత్రం విఘ్నేశ్వరస్వామి పూజ, బింబశుద్ధి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామపెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రగ్బీ పోటీల్లో జిల్లా జట్ల ప్రతిభ



విజేతగా నిలిచిన జిల్లా పురుషుల జట్టు



ద్వితీయ స్థానం సాధించిన బాలికల జట్టు

- తొలిస్థానంలో పురుషుల జట్టు
- రెండో స్థానంలో సీనియర్ బాలికల జట్టు

కొడవలూరు : ఈనెల 27, 28వ తేదీల్లో తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో జిల్లా పురుషుల జట్టు ప్రథమ బహుమతి సాధించి విజేతగా నిలిచింది. జిల్లా సీనియర్ బాలికల జట్టు ద్వితీయ బహుమతి సాధించింది. మండలంలోని గండవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 26న జిల్లా రగ్బీ జట్లను ఎంపిక చేసిన విషయం తెల్సిందే. రాష్ట్ర పోటీల్లో ప్రతిభ కనబరచి ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించిన జట్లను జిల్లా రగ్బీ అసోసియేషన్ కార్యదర్శి పి.రమేష్, అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, జట్టు కోచ్ దాసరి వంశీలు ప్రత్యేకంగా అభినందించారు.

విద్యుత్ షాక్‌తో జేఎల్‌ఎంకు గాయాలు

వెంకటాచలం: విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై జేఎల్‌ఎం హరికృష్ణకు గాయాలయ్యారు. ఈ ఘటన మండలంలోని నిడిగుంటపాళెంలో ఆదివారం జరిగింది. ముత్తుకూరు మండలం మిట్టపాళెం గ్రామానికి చెందిన హరికృష్ణ నిడిగుంటపాళెంలో జేఎల్‌ఎంగా విధులు నిర్వర్తిస్తున్నాడు. గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురికావడంతో ఆదివారం దానిని బాగు చేస్తుండగా, ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి హరికృష్ణ కింద పడ్డాడు. వెంటనే ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది కలిసి హరికృష్ణను చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం చెన్నైకు తీసుకెళ్లారు. ప్రస్తుతం హరికృష్ణ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది.

రాము ఆచారికి పురస్కారం

మనుబోలు : మండలంలోని యాచవరం గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు ఆలూరు రాము ఆచారికి విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి విశ్వకర్మ లెజెండ్రి పురస్కారాన్ని అందజేశారు. ఫౌండేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ ఆచారి, ఫౌండర్ విశ్వనాథుల పుష్పగిరి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా మనుబోలు విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు రాము ఆచారికి సోమవారం అభినందనలు తెలియజేశారు.



రాము ఆచారిని సత్కరిస్తున్న అతిథులు

యోగాతో ఆరోగ్యం

కొడవలూరు: చిన్న వయస్సు నుంచే యోగ చేయడం ఆరోగ్యకరమని కొడవలూరు లైబ్రేరియన్ కె.రాజేశ్వరి సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథాలయంలో చిన్నారులకు సోమవారం యోగాపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి శిబిరానికి రావడం వల్ల వడగాల్పుల నుంచి రక్షణ పొందడంతో పాటు విజ్ఞానం పెంపొందించుకోవచ్చన్నారు. ఈ శిబిరంలో చిన్నారులకు ఆట, పాటలతో కూడిన విజ్ఞానం అందిస్తున్నట్లు వెల్లడించారు.



యోగా చేస్తున్న చిన్నారులు

రైల్వే ట్రాక్‌పై తిరగడం నేరం

మనుబోలు : రైలు పట్టాలపై తిరగడం నేరమని, అలాంటి పనులు చేస్తే శిక్షలు తప్పవని ఆర్‌పీఎఫ్ ఏఎస్సై నాగరాజరావు అన్నారు. మండలంలోని చెర్లోపల్లి రైల్వేగేటు వద్ద ఆదివారం రాత్రి స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైలు పట్టాలపై నడవడం, రైలుపై రాళ్లు విసరడం లాంటి పనులు నేరమన్నారు. రెండు ట్రాక్‌ల మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో గేదెలను మేపరాదన్నారు.



యువకులకు అవగాహన కల్పిస్తున్న రైల్వే పోలీసులు

జాతీయ బాక్సింగ్ పోటీలకు కోవూరు విద్యార్థిని

కోవూరు : స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి పూర్తి చేసుకున్న జంగం పూజిత అనే విద్యార్థిని బాక్సింగ్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని పాఠశాల హెచ్‌ఎం ఎస్.నరసింహమూర్తి తెలిపారు. పాఠశాల ఆవరణలో సోమవారం ఆయన మాట్లాడారు. జూన్ 6 నుంచి 12వ తేదీ వరకు భోపాల్‌లో జరుగనున్న జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు పూజిత హాజరవుతుందన్నారు.